కామారెడ్డిలో వార్ వన్‌సైడే!

కేసీఆర్‌ను తట్టుకునుడు కాంగ్రెస్‌తో కాదు
నీళ్ల కష్టం తీర్చినోడు.. కరెంట్ ఇచ్చినోడు
ఆపతికి ఆదుకున్నోడికే అందరి ఓటు
కేసీఆర్‌తో మా జిల్లా దశ మారుతుంది
సీఎం పోటీపై కామారెడ్డివాసుల మనోగతం

(కామారెడ్డి నుంచి నూర శ్రీనివాస్)

బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి నుంచి పోటీచేస్తుండటంతో ఈ 2 నియోజకవర్గాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. సీఎం కేసీఆర్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకెళ్తున్నది. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ రాక పట్ల కామారెడ్డి ప్రజలు ఏమనుకుంటున్నారు? వారి మనోగతం ఏమిటి? గతంలో కేసీఆర్‌కి కామారెడ్డితో ఉన్న అనుబంధం ఏమిటి? కామారెడ్డి నుంచి పోటీచేస్తున్నట్టు కేసీఆర్ ప్రకటించినప్పటి నుంచి అక్కడ జరుగుతున్న పరిణామాలేమిటి? తదితర అంశాలపై ఆసక్తి నెలకొన్నది. ఈ నేపథ్యంలో కామారెడ్డితోపాటు సమీప మండలాల్లోని గ్రామాల ప్రజల మనోగతాన్ని 'నమస్తే తెలంగాణ' ఒడిసిపట్టే ప్రయత్నం చేసింది. కామారెడ్డి, భిక్కనూరు, దొమకొండ మండలాల్లో పర్యటించిన 'నమస్తే తెలంగాణ' బృందం గ్రౌండ్ రిపోర్ట్.

'కేసీఆర్‌ను తట్టుకునుడు కష్టం.. ఆయన పోటీ చేస్తున్నడంటే అందరూ సంబురంగా ఫీలవుతున్నారు.. ఇక సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ మాదిరిగానే మా నియోజకవర్గం కూడా అభివృద్ధి చెందుతుంది'.. ఇదీ కామారెడ్డి నియోజకవర్గంలోని ఏ మూలకు వెళ్లినా వినిపిస్తున్న మాట. 'కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీ చేస్తున్నడు అనంగనే భూములకు బయానా తీసుకున్నవాళ్లు తిరిగి ఇచ్చేస్తున్నరు' అని ఓ రియల్‌ఎస్టేట్ వ్యాపారి పేర్కొనడం కేసీఆర్ గెలుపుపై ఉన్న అంచనాలు, అక్కడ జరగబోయే అభివృద్ధిపై స్థానికులకు ఉన్న విశ్వాసాన్ని సూచిస్తున్నది. పండుగ షాపింగ్‌కు వచ్చినోళ్లు కేసీఆర్ గురించే గొప్పగా మాట్లాడుకుంటున్నారంటూ బట్టల షాపు నిర్వాహకురాలు చేసిన వ్యాఖ్య నియోజకవర్గం మూడ్‌కు అద్దం పడుతున్నది. పింఛన్ రాకపోతే మా అమ్మ ఇంతకాలం బతికేదే కాదని ఓ మహిళ చేసిన వ్యాఖ్య ఆయా వర్గాల్లో కేసీఆర్ పట్ల గూడుకట్టుకున్న కృతజ్ఞతాభావాన్ని ప్రతిబింబిస్తున్నది. కామారెడ్డి నుంచి కూడా పోటీ చేస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించడమే ఆలస్యం ఆయన నిర్ణయాన్ని స్వాగతిస్తూ అనేక గ్రామాలు ఏకగ్రీవ తీర్మానాలు చేశాయి. క్షేత్రస్థాయిలో కేసీఆర్ పట్ల అన్ని సామాజికవర్గాల్లో సానుకూలత కనిపిస్తున్నది. పల్లె ప్రాంతాలు మూకుమ్మడిగా బీఆర్ఎస్‌కు జైకొడుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లోనూ 'కేసీఆర్ వస్తే.. కామారెడ్డి బాగుపడుతుంది' అనే ఆశాభావం బలంగా వ్యక్తమవుతున్నది. మహిళలు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, అభివృద్ధి కాముకులు ఇలా విభిన్నవర్గాల ప్రజలు కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు.

మళ్లా కేసీఆరే అస్తడు

మళ్లా కేసీఆరే అస్తడు. అందరి కడుపు ఇసారిచ్చిండు. అన్నంపెట్టినోళ్లకు సున్నం పెట్టరు జనం. 250 యూనిట్ల కరెంట్ ఫ్రీతోని కరెంట్ ఇస్త్రీపెట్టె తెచ్చుకున్నం. బొగ్గులపెట్టె వజన్ ఎక్కువ. ఇప్పుడు కరెంట్ పెట్టె అల్కగ ఉంటది. చేతులకు అలసట ఉండదు. బొగ్గులపెట్టెతోని ఇస్త్రీ చేసేటప్పుడు మిరుగులు పడి బట్టలు ఖరాబ్ అయ్యేది. తెల్లబట్టలకు మరకలు అవుడు, చీరెలు కాలిపోవుడు ఉండేది. అప్పుడప్పుడు దండుగ కట్టేది. మాటలు పడేది. కేసీఆర్ కడుపు నల్లగుండ తిప్పలు తీర్చిండు.

– సావిత్రి, లాండ్రిషాప్ నిర్వాహకురాలు

పింఛనే మా అమ్మను బతికిస్తున్నది

కామారెడ్డిలో కేసీఆర్‌సార్ నిలబడతడు అంటే అందరికీ సంబురంగా ఉన్నది. పండుగ బట్టలు కొనేందుకు వచ్చినోళ్లు బేరం చేసుకుంటూ కేసీఆర్ గురించే ముచ్చట పెడ్తున్నరు. మాక్కూడా కేసీఆరే రావాల్నని ఉన్నది. మంచి పనులు చేస్తుండు. నాకు అన్నదమ్ముల్లేరు. నేనొక్కదాన్నే. మా అమ్మకు నెలకు రెండువేలు పింఛన్ వస్తున్నది. మాకు భూమిలేదు. జాగలేదు. నాన్నలేడు. ఆ పైసలు రాకపోతే ఆమె ఇంతకాలం బతికేదే కాదు. పింఛన్ పైసలు ధైర్యాన్ని ఇస్తున్నవి. మళ్లా కేసీఆరే వస్తడు. అందరికి అన్నీ చేస్తున్న కేసీఆర్‌ను ఎవరూ కాదనరు.

–సునీత, క్లాత్‌మార్చంట్ నిర్వాహకురాలు

కేసీఆర్‌ను తట్టుకునుడు కష్టం

కేసీఆర్ వద్దంటే కరెంట్ ఇత్తాండు. యాభై ఏండ్ల కాంగ్రెసోడు ఏం చేసిండు? ఏం చేయలే. కాంగ్రెసోడు రెండు వందల పింఛన్ చేసిండు. ఏమిట్లకు ఏమైతది? కేసీఆర్ రెండువేలు ఇత్తుండు. ఇప్పుడు ఐదు వేలు చేస్తడట. కుంటోళ్లకు, గుడ్డోళ్లకు ఇప్పటికే నాలుగువేలు చేసిండు. ఆడపిల్ల పెండ్లికి పైసలు ఇచ్చిండు. దవాఖాన్ల పిల్లపుడితే వేలకు వేలు ఇస్తుండు. లావని భూములు కూడా పట్టా కావాల్నని అనుకుంటున్నరు. కామారెడ్డిలో కేసీఆరే దిగితే కండ్లపండుగ లెక్క గెలిపిత్తరు. కేసీఆర్ దిగితే తట్టుకునుడు కష్టం. కాంగ్రెస్ కాదు.. ఎవల్తోని కాదు. కేసీఆర్ వస్తే ఎవలు నెగ్గలేరని లోకం అంటుంది.

–గొర్ల భిక్షపతి, దొమకొండ

కేసీఆర్ చేసిన పనులు ఎవలు చేయలె

నేను బీడీలు చేస్తా. మా బీడీ కార్మికులను ఎవలు పట్టిచ్చుకోలె. కేసీఆర్ పట్టిచ్చుకున్నడు. అడగకుండానే మాకు రెండువేల పింఛన్ ఇచ్చిండు. ఇప్పుడు మళ్ల పెంచుత అంటున్నడు. ఇదివరకు మంచినీళ్లకు మస్తు తిప్పలు పడేది. ఎక్కడికెక్కడికో పోయి నీళ్లు మోసేది. మోసి, మోసి భుజాలు కాయలు కాసినయి. బోర్లు కొట్టి కొట్టి చేతులు నొచ్చేది. ఇప్పుడా గోస తప్పింది. నా బిడ్డకు కల్యాణక్ష్మి వచ్చింది. కేసీఆరే మళ్ల వస్తడు. మాకు ఇల్లు వస్తది.

–ప్రమీల, బీడీ కార్మికురాలు

కేసీఆర్ దిక్కే ఎక్కువమంది

యాభై ఏండ్లు నీళ్ల కోసం తిప్పల పడ్డం. చేతివంపు కొట్టికొట్టే చేతులు పోయేది. కేసీఆర్ నీళ్ల తిప్పలు తీర్చిండు. నా బిడ్డ పెండ్లికి కల్యాణ లక్ష్మి పైసలొచ్చినయి. ఏడాది కింద నా భర్త చనిపోయిండు. రైతుబీమా వచ్చింది. నాకు ఇద్దరు కొడుకులు. ఒకడు దుబాయ్‌ల ఉంటడు. ఇంకొకడు ఇక్కడే (కామారెడ్డి) ఉంటడు. సద్దితిన్న రేవు తలవాలె. అందుకనే కేసీఆర్ దిక్కే ఎక్కువమంది ఉన్నరు.

–కళావతి, కామారెడ్డి

ప్రతిపక్ష కార్యకర్తలబీ అదే మాట!

'కాంగ్రెస్ నుంచి షబ్బీర్‌అలీ చాలా ఏండ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిండు. వ్యక్తిగతంగా అందరికీ అందుబాటులో ఉంటడు. కానీ, అభివృద్ధి ఉండదు. బీజేపీ నుంచి పోటీచేస్తానంటున్న వ్యక్తి కుల సంఘాలకు కమ్యూనిటీ హాళ్లు, గుడులకు విరాళాలు ఇస్తున్నడు. కానీ, బీజేపీకి జనంలో బలం లేదు. వీళ్లేవ్వరూ కేసీఆర్‌తో సరితూగలేరు' అంటూ మధ్యతరగతికి చెందిన ఒక వ్యాపారి విశ్లేషించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ సహా ఇతర పార్టీలు బీఆర్ఎస్ ఓటుబ్యాంకును చీల్చేందుకు పదుల సంఖ్యలో అభ్యర్థులను రంగంలో దింపి ప్రయోజనం పొందాలని చూస్తున్నాయని, అలాంటివి పనిచేయవని చర్చించుకుంటున్నారు. '50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ కామారెడ్డికి ఏం చేసింది? కేసీఆర్ వచ్చినంక జిల్లా చేసిండు. మెడికల్ కాలేజీ పెట్టిండు' అనే చర్చ జరుగుతున్నది. 'సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ తదితర నియోజకవర్గాలు అద్భుత ప్రగతి సాధించాయి. కేసీఆర్ పోటీ చేస్తే 3 జాతీయ రహదారులను ఆనుకొని ఉన్న కామారెడ్డి అభివృద్ధి అయితదని ఊళ్లల్లో చర్చ జరుగుతున్నది' అని ధూమల మధు అనే యువకుడు చెప్పడం ప్రజల నాడిని సూచిస్తున్నది.

మంచి పాలనకే మద్దతు

పదేండ్ల సీఎం కేసీఆర్ పాలనను, గత పాలనను ప్రజలు పోల్చుకుంటున్నారు. యాభై ఏండ్ల నీళ్ల కష్టాలు తీర్చి, కరెంట్ వెలుగు తెచ్చింది కేసీఆరేనని పార్టీలకు అతీతంగా కొనియాడుతున్నారు. మహిళలు తాము మంచినీళ్ల కోసం కిలోమీటర్ల దూరం నడిచిపోయిన రోజులు, చేతిపంపులతో చేతులు నొప్పి పుట్టిన రోజులు, వాటర్ ట్యాంకర్ల దగ్గర కొట్లాటలు, ఘర్షణలను గుర్తు చేసుకుంటున్నారు. కరెంట్ లేక ఎండిన పంటలను, కాలిన మోటర్లను మరువలేకపోతున్నారు. మంచి పాలనకే మద్దతు ఇస్తామని చెప్తున్నారు.

గ్రౌండ్ రిపోర్ట్

అభివృద్ధిపై ఆశ

కేసీఆర్‌తోనే కామారెడ్డి అభివృద్ధి సాధ్యమన్న భావన ప్రతిపక్షపార్టీల కార్యకర్తల్లోనూ వ్యక్తమవుతుండటం విశేషం. 'కేసీఆర్ వస్తే కామారెడ్డి మస్తు అభివృద్ధి అయితది. అందులో డౌట్‌లేదు' అని కామారెడ్డి పట్టణానికి చెందిన ఒక బీజేపీ కార్యకర్త పేర్కొనడం ప్రజల మూడ్‌ను సూచిస్తున్నది. 'కేసీఆర్ బాగా చేస్తున్నడు. ఇక్కడి నుంచి పోటీచేస్తానంటే మిగితా వాళ్లు ఆలోచిస్తున్నరు. కానీ కేసీఆర్ ఇక్కడ ఉండరట.. కదా' అని సలీం అనే యువకుడు అనుమానం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లాగా అవతరించడం, మెడికల్ కాలేజీ రావడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. కేసీఆర్‌తోనే మరింత అభివృద్ధి సాధ్యమని నమ్ముతున్నారు. 'కామారెడ్డి కా నామ్ బహుత్ హై.. మగర్ కామ కమ్‌హై. అబీ కేసీఆర్ సాబ్ ఆరే బోర్లే ఆయేతో బహుత్ అచ్చా కామ్ చల్తాహై' అని బైక్ మెకానిక్ గుల్షన్‌పాషా ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సిద్దిపేట, సిరిసిల్ల, సిద్దిపేట తరహాలో కేసీఆర్ కామారెడ్డిని కూడా అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తారనే విశ్వాసం సర్వత్రా వ్యక్తమవుతున్నది.

24 గంటల కరెంట్ ఎవల్తోనైనా అయిద్దా?

కేసీఆర్ వస్తే ఇంకింత డెవలప్ అయితది. కామారెడ్డిలో ఇప్పటిదాకా అయింది ఒకెత్తు, కేసీఆర్ వత్తే ఇంకొకెత్తు. ఇద్వరకు కరెంట్ 4 గంటలు ఉంటే మహా ఎక్కువ. ఇప్పుడు 24 గంటల కరెంట్. అట్ల కరెంట్ ఇచ్చుడు ఎవల్తోనైనా అయిద్దా? కేసీఆర్ కాకుంట ఎవల్తోని కాకపోయ్యేది. కాంగ్రెసోళ్లతోని, బీజేపోళ్లతోని పనులు జేసుడు కానేకాదు. హండ్రెడ్ పర్సెంట్ కేసీఆరే మళ్లీ గవర్నమెంట్లకు వస్తడు. కామారెడ్డిని బాగుచేస్తడు.

–రమేశ్‌గౌడ్, స్క్రాప్ వ్యాపారి

ఈ సంవత్సరం కాలమే లేదు.. రైతులు కరెంట్‌తోని బతుకుతున్నరు

కేసీఆర్ నీళ్ల తెత్తుండు. ఏ ప్రధానమంత్రితోని కాలే నీళ్ల తెచ్చుడు. తెలంగాణ వచ్చినంక బ్రహ్మాండమైన అభివృద్ధి చేస్తుండు. కాంగ్రెస్సోళ్లు మస్తుగంటరు. నేను కూడా మస్తు మాటలు చెప్త. అయిద్దా? కేసీఆర్ అన్ని కులాలకు అన్ని జేసిండు. 24 గంటల కరెంట్ ఇస్తున్నడు. మూడు గంటల కరెంట్ సరిపోద్ది అంటారే కాంగ్రెసోళ్లు. ఈ సంవత్సరం కాలమే కాలేదు. కరెంట్‌తోనే రైతులు బతుకుతున్నరు. అన్నంపెట్టినోడే అయ్య. ఆపతికి ఆదుకున్నోడికే ఓటు.

–రాజయ్య, దొమకొండ

ఆర్టీసీని కేసీఆర్ బతికిచ్చిండు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం గొప్ప విషయం. గతంలో చంద్రబాబు ఆర్టీసీని చంపాలని చూసిండు. కేసీఆర్ దాన్ని బతికిచ్చిండు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఎన్నోరోజులు కష్టపడ్డా కాలేదు. ఇప్పుడు అయినందుకు సంతోషంగా ఉన్నది. కేసీఆర్‌కు ఓటేస్తే కామారెడ్డి అభివృద్ధి అయితదని అనుకుంటున్నరు జనమంతా.

–కేఎన్ చారి, ఆర్టీసీ రిటైర్డ్ కండక్టర్

కామారెడ్డి బ్రిగేడియర్ కేసీఆర్

తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో సీఎం కేసీఆర్ కామారెడ్డి బ్రిగేడియర్‌గా వ్యవహరించిన విషయాన్ని ఇక్కడివాసులు గుర్తు చేసుకుంటున్నారు. పార్టీ ఆవిర్భవించిన తొలినాళ్లల్లో ఉద్యమవ్యాప్తికి పార్టీ నిర్మాణం కీలకమని భావించి ప్రతి మండలానికి ఒక బ్రిగేడియర్‌ను నియమించారు. ఆ సమయంలో సీఎం కేసీఆర్ కామారెడ్డి మండలానికి బ్రిగేడియర్‌గా బాధ్యతలు స్వీకరించి మండలంలోనే రెండు రోజులు బసచేశారని నర్సింగరావు గుర్తుచేసుకున్నారు. మండలంలో నాడు ఉన్న 18 గ్రామ పంచాయతీలకు పార్టీ గ్రామ కమిటీలు, పార్టీ అనుబంధ కమిటీలు ఆయనే స్వయంగా దగ్గరుండి వేశారని చెప్పుకుంటున్నారు.

కేసీఆర్ తొలి కూలి పని ఇక్కడి నుంచే..

ఉద్యమ నిర్మాణంలో భాగంగా బహిరంగసభల నిర్వహణకు నిధులు సమకూర్చేందుకు పార్టీ అధినేత మొదలు కార్యకర్తలు కూలిపని చేయాలని నిర్ణయించారు. తద్వారా ఉద్యమ ఆకాంక్షను ప్రతి ఒక్కరిలో పాదుకొల్పాలనే సంకల్పంతో కేసీఆర్ కామారెడ్డి పట్టణంలోని బాంబే క్లాత్ హౌస్, దేశాయి బీడీవర్క్స్‌లో కూలిపని చేసి నిధులు సమకూర్చారని పట్టణవాసులు యాది చేసుకొంటున్నారు.

తొలి ఉద్యమ కేసు నమోదైంది ఇక్కడే

ఉద్యమకారులపై ఉమ్మడి రాష్ట్రంలో రౌడీషీట్లు, పీడీయాక్ట్‌లు, రైల్వేకేసులు వేలాదిగా నమోదయ్యాయి. తెలంగాణ ద్రోహులపై చెప్పులు విరిసిన తొలిగడ్డ కూడా కామారెడ్డేనని ఉద్యమకారులు గుర్తుచేసుకుంటున్నారు. కామారెడ్డిలో నిర్వహించిన నిరసన సందర్భంగా ఉద్యమకారులు రెండు బస్సులకు నిప్పు అంటించారు. కొమ్ముల తిరుమల్‌రెడ్డితో సహా 11 మంది ఉద్యమకారులు 14 రోజులు జైలు శిక్షను అనుభవించారని గుర్తుచేసుకుంటున్నారు.

బుధవారం జూబ్లీహిల్స్‌లో స్వదేశ్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న నీతా అంబానీ

హైదరాబాద్‌లో తొలి స్వదేశ్ స్టోర్

ఏర్పాటుచేసిన రిలయన్స్ రిటైల్ • నీతా అంబానీ చేతులమీదుగా ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 8: రిలయన్స్ రిటైల్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొస్తున్న స్వదేశ్ స్టోర్లలో తొలి స్టోర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటుచేసింది. బుధవారం రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్‌పర్సన్ నీతా అంబానీ ఈ స్టోర్‌ను ప్రారంభించారు. జూబ్లీ హిల్స్‌లోని అల్కజార్ మాల్‌లో 20వేల చదరపు అడుగుల్లో దీన్ని తీసుకొచ్చారు. నైపుణ్యం, ప్రతిభ కలిగిన దేశీయ కళాకారులతో తయారైన అత్యుత్తమ వస్తూత్పత్తులను ఈ స్టోర్లలో విక్రయిస్తారు. నాణ్యమైన ఆహారోత్పత్తులు, హస్తకళలు, చిత్రాలు, చేనేత వస్త్రాలు, దుస్తులు, ఆభరణాలు, గృహాలంకరణ వస్తువులు, కార్పెట్లు, మట్టితో తయారు చేసిన కుండలు, ఇతరత్రా కళాఖండాలు ఇక్కడ లభిస్తాయి. 'భారతీయ సంప్రదాయ కళలు, కళాకారులను ప్రోత్సహించడానికి, వాటికి దేశ, విదేశాల్లో మరింత గుర్తింపును తీసుకురావడానికి ఈ స్వదేశ్ స్టోర్లు దోహదం చేయగలవు. భారత్‌లోనేగాక, అమెరికా, ఐరోపా తదితర దేశాల్లోనూ ఈ స్టోర్లను ఏర్పాటు చేస్తాం' అని ఈ సందర్భంగా నీతా అంబానీ అన్నారు. ఇప్పటికే ముంబైలో తాము ఏర్పాటుచేసిన నీతా ముకేశ్ అంబానీ సాంస్కృతిక కేంద్రం (ఎన్ఎంఏసీసీ)లోనూ అద్భుత రీతిలో ఓ స్వదేశ్ ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను ఆవిష్కరించామని గుర్తుచేశారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి దేశంలోని ప్రముఖ నగరాల్లోనూ ఈ స్టోర్లను తేన్నారు. కాగా, సానియా మీర్జా, పీవీ సింధు, నమ్రతా శిరోద్కర్ తదితర క్రీడా, సినీ సెలబ్రిటీలూ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఇక చకచకా కొరియర్ కార్గో

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇంపోర్ట్ కొరియర్ టెర్మినల్ ప్రారంభం

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇంపోర్ట్ కొరియర్ టెర్మినల్‌ను ప్రారంభించారు. జీఎమ్మార్ హైదరాబాద్ ఎయిర్ కార్గో (జీహెచ్ఏసీ) ఈ మేరకు బుధవారం ప్రకటించింది. వేగవంతమైన కార్గో ప్రాసెసింగ్, ఇంపోర్ట్ కొరియర్ క్లియరెన్స్‌కు ఇది దోహదం చేయగలదన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా జీహెచ్ఏసీ వ్యక్తం చేసింది. ఇందుకు కస్టమ్స్ అధికారులు కృషి చేయనున్నట్టు తెలిపింది. కాగా, ప్రపంచ స్థాయి సెక్యూరిటీ స్క్రీనింగ్, అత్యాధునిక కార్గో నిర్వహణ వ్యవస్థలతో 300 చదరపు మీటర్ల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ టెర్మినల్‌లో కొరియర్ కార్గో దిగుమతులు నిరంతరం సాగనున్నాయి. 'మా కస్టమర్లకు ప్రపంచ శ్రేణి లాజిస్టిక్ సేవల్ని అందించడానికి మేము చేస్తున్న కృషికి ఇదో నిదర్శనం' అని జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ సీఈవో ప్రదీప్ ఫణికర్ అన్నారు. ఇదే స్ఫూర్తితో తమ సేవలను మరింత వేగవంతం చేస్తామన్నారు. జీహెచ్ఏసీ ప్రస్తుతం నెలకు 120 మెట్రిక్ టన్నులకు పైగా ఎగుమతి కొరియర్లను నిర్వహిస్తోంది. ఈ కొత్త టెర్మినల్‌తో దిగుమతి కొరియర్ సామర్థ్యం నెలకు 150 మెట్రిక్ టన్నులను తాకుతుందన్న విశ్వాసాన్ని జీహెచ్ఏసీ వెలిబుచ్చుతున్నది. ఈ క్రమంలోనే ఇకపై డాక్యుమెంట్లు, రెడిమేడ్ దుస్తులు, నమూనాలు, గృహోపకరణాలు, ఇంజినీరింగ్ వస్తూత్పత్తులు ఇక్కడ పెద్ద ఎత్తున ఎగుమతి-దిగుమతులవుతాయని చెప్తున్నారు.

కావేరీ సీడ్స్ లాభం మూడింతలు

క్యూ2లో రూ.10.72 కోట్లుగా నమోదు • 97కోట్ల ఆదాయాన్ని ఆర్జించిన సంస్థ

హైదరాబాద్, నవంబర్ 8:ప్రముఖ విత్తనాల విక్రయ సంస్థ కావేరీ సీడ్స్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.10.72 కోట్ల పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2.72 కోట్లతో పోలిస్తే ఇంచుమించు మూడు రెట్లు పెరిగాయి. గత త్రైమాసికానికిగాను సంస్థ రూ.96.12 కోట్ల రాబడిని ఆర్జించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.84.49 కోట్ల ఆదాయం కంటే ఇది 13.77 శాతం అధికమని పేర్కొంది. ఎబిటా 70 శాతం ఎగబాకి రూ.19.79 కోట్లు ఆర్జించింది.

తొలి ఆరు నెలల్లో..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలు(ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు) ఆదాయ, లాభాల పరంగా భారీ వృద్ధిని నమోదు చేసుకున్నది. నిర్వాహణ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 5.75 శాతం ఎగబాకి రూ.816.44 కోట్ల నుంచి రూ.863.42 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. ఎబిటా కూడా 15 శాతం వృద్ధితో రూ.298.88 కోట్లకు చేరుకున్నది. నికర లాభం రూ.243.39 కోట్ల నుంచి రూ.278.56 కోట్లుగా నమోదైనట్టు వెల్లడించింది.

రెండో త్రైమాసికంలో ముఖ్య అంశాలు..

- పత్తి విత్తనాలు విక్రయించడంతో సంస్థకు సమకూరిన ఆదాయంలో 6.77 శాతం పెరుగుదల కనిపించింది.
- హైబ్రిడ్ వరి ద్వారా వచ్చే ఆదాయంలో 9.97 శాతం అధిక వృద్ధి నమోదైంది. ఎంపిక చేసిన వరి విక్రయాలు 4.87 శాతం పెరుగగా, ఆదాయంలోనూ 14.80 శాతం వృద్ధి నమోదైంది.
- మొక్కజొన్న విత్తనాలతో వచ్చే ఆదాయంలో 13.96 శాతం పెరుగుదల నమోదైంది.
- సంస్థకు వచ్చిన మొత్తం ఆదాయంలో నూతన ఉత్పత్తుల వాటా రెండంకెల వృద్ధి
- విదేశాల్లో కంపెనీకి చెందిన ఉత్పత్తులకు డిమాండ్ అధికంగా ఉండటంతో ఎగుమతుల్లో వృద్ధి 146.49 శాతంగా నమోదైంది. వీటిలో మొక్కజొన్న విత్తనాలు ఎగుమతులు 129.91 శాతం పెరుగగా, ఆదాయ పరంగా చూస్తే 140.52 శాతంగా ఉన్నది.
- రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.5 లేదా 250 శాతం డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది.

'కీలకమైన విత్తన విభాగంలో అత్యుత్తమ వృద్ధిరేటును సాధించాం. వరి, పత్తి విత్తనాలు నిలకడైన వృద్ధిని నమోదు చేసుకున్నప్పటికీ, వ్యూహాత్మక విధానాలతో ఆదాయంలో అంచనాలకుమించి రాణించగలిగాం. అంతర్జాతీయ మార్కెట్లో వరి ధరలు భారీగా పెరగడం కూడా కలిసొచ్చింది. దీంతో అక్కడ వరి సాగు 11 శాతం వరకు పెరిగింది. అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగంగా తాంజానియా, అల్జీరియా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, మధ్య ప్రాచ్య దేశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వాటాదారులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.5 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించాం.

- జీవీ భాస్కర్ రావు, కావేరీ సీడ్స్ సీఎండీ

సెలెక్ట్ దీపావళి ఆఫర్లు

హైదరాబాద్, నవంబర్ 8: సెలెక్ట్.. దీపావళి పండుగను దృష్టిలో పెట్టుకొని 'గ్రేట్ ఫెస్టివల్ డేస్' ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ వై గురు మాట్లాడుతూ..కొనుగోలుదారులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో 'స్కాన్ అండ్ విన్' ప్రవేశపెట్టినట్టు చెప్పారు. ఈ స్కాన్ అండ్ విన్ ద్వారా స్మార్ట్‌ఫోన్లపై 25 శాతం డిస్కౌంట్, ఎల్ఈడీ టీవీ కేవలం రూ. 999కే, బై వన్ గేట్ వన్ కాంబో ఆఫర్, యాక్ససరీస్‌పై ప్రత్యేక తగ్గింపు ధరకు విక్రయిస్తున్నట్టు తెలిపారు. అలాగే ఎల్ఈడీ టీవీ ధరలోనే క్యూలెడ్ టీవీని పొందే అవకాశాన్ని కల్పిస్తున్నది. అలాగే ఎంపిక చేసిన మొబైళ్లపై పలు బ్యాంకులు ఆఫర్లు అందిస్తున్నాయి. వీటితోపాటు రూ. 6,999కే ఎల్ఈడీ టీవీ, ఎల్ఈడీ టీవీ+సౌండ్ బార్‌తో ప్రత్యేక కాంబో, బ్రాండెడ్ స్మార్ట్‌వాచ్‌ని రూ.999 ప్రారంభ ధర, విద్యార్థులకు ల్యాప్‌టాప్, టాబ్స్‌ను తక్కువ ధరకే అందిస్తున్నది.

రూ.45 కోట్లతో లిండ్‌స్ట్రోమ్ ఫెసిలిటీ

హైదరాబాద్‌లో 3 ఎకరాల్లో ఏర్పాటు

మేకగూడలో లిండ్‌స్ట్రోమ్ సర్వీసెస్ ఇండియా పరిశ్రమను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్, పరిశ్రమ ప్రతినిధులు

నందిగామ, నవంబర్ 8: ఫిన్లాండ్ సంస్థ లిండ్‌స్ట్రోమ్‌కు సబ్సిడరీ అయిన లిండ్‌స్ట్రోమ్ ఇండియా బుధవారం అత్యాధునిక వర్క్‌వేర్ ఫెసిలిటీని ప్రారంభించింది. ఈ కంపెనీకి ఇది హైదరాబాద్‌లో రెండవ ఫెసిలిటీ. ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, హెల్త్‌కేర్, ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్ పరిశ్రమలకు వర్క్‌వేర్, క్లీన్‌రూమ్ వర్క్‌వేర్ సర్వీసుల్ని ఈ కంపెనీ అందిస్తుంది. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేకగూడ శివారు 3 ఎకరాల విస్తీర్ణంలో రూ.45 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుచేసిన ఈ సదుపాయాన్ని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ ముఖ్యఅతిథిగా హాజరై ఫిన్లాండ్ రాయబారి కిమ్మో లహ్దేవిర్తాతో కలిసి ప్రారంభించారు. తాజా ఫెసిలిటీతో లిండ్‌స్ట్రోమ్‌కు దేశవ్యాప్తంగా 11 వర్క్‌వేర్, 2 క్లీన్‌రూమ్ యూనిట్లు ఉన్నాయి.

పెట్టుబడులకు అనువు తెలంగాణ

యూనిట్ ప్రారంభ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణం, సౌకర్యాలు ఉన్నాయన్నారు. రాష్ట్రం లో పరిశ్రమల ఏర్పాటు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నదని, టీఎస్ ఐ పాస్‌తో పాటు పరిశ్రమలకు 24 గంటల కరెంట్, రవాణా వ్యవస్థ, శాంతి భద్రతల పరిరక్షణ వంటి అనేక చర్యలు ప్రభుత్వం తీసుకుంటున్నదని, తద్వారా రాష్ట్రంలో తొమ్మిది సంవత్సరాలలో అన్ని రంగాలలో పెట్టుబడులు భారీగా